నమస్తే తెలంగాణ

రాజన్న సిరిసిల్ల

5 | కరీంనగర్, శుక్రవారం 24 మే 2024 | RAJANNA SIRCILLA


### రోజుకు ఒక్క ట్రిప్పే ఎక్కువ

ఆరు నెలల కింద రోజుకు ఐదారు ట్రిప్పులు కొట్టెటోన్ని. డీజిల్ పైసలుపోను రోజుకు వెయ్యి పన్నెండు వందలు మిగిలేటియి. అప్పుడు ఇట్ల రోడ్డెక్కంగనే అట్ల ప్యాసింజర్లు ఎక్కెటోళ్లు. నలుగురైదుగురు ఆటోల కూసోంగనే బయలుదేరెటోన్ని. పోంగ పోంగ స్టేజీల దగ్గర ప్యాసింజర్లు దొరికెటోళ్లు. ఆటోల జాగ లేదని అప్పుడు



ఆపెటోళ్లను కూడా వదిలేసి పాయెటోన్ని. ఇప్పుడు గ్యారంటీ లేని బతుకైపోయింది మాది. కనీసం ఎనిమిది మంది ఉంటెనే ఆటో కదిలిస్తన్నం. మధ్యల ఎక్కెటోళ్లు ఉంట లేరు. అప్పుడు రోజుకు లింగాపురం నుంచి కరీంనగర్‌కు ఐదారు ట్రిప్పులు వేసెటోన్ని. ఇపుడు ఒక్క ట్రిప్పు ఏసుడు కష్టమైతంది. పొద్దున తొమ్మిది గంటలకు ఇంట్లకెల్లి వచ్చిన. ఇప్పుడు మధ్యాహ్నం రెండు అయితంది. కొందరు దొరికిన్రు. ఇవి మా బతకులు. రాను రాను ఇంక అధ్వానం అయ్యేతట్టున్నది.

**- పిట్టల కుమార్, లింగాపూర్ (మానకొండూర్ మండలం)**



# ఆటోడ్రైవర్ల ఆకలి కేకలు

## కాంగ్రెస్ సర్కారు తెచ్చిన ఫ్రీ బస్సు ముప్పు

- ఉపాధి లేక ఆరు నెలలుగా ఆగమైన బతుకులు
- గతంలో రోజుకు నాలుగైదు ట్రిప్పులు.. ₹వెయ్యికి పైనే ఆదాయం
- ఇప్పుడు రోజంతా వేచి ఉన్నా ఒక్క రౌండ్‌కు దిక్కు లేదు
- తిండి ఖర్చుల మందం రాని దుస్థితి
- పిల్లలను సైతం చదివించలేని పరిస్థితులు
- ఈఎంఐలు కట్టకపోవడంతో వాహనాలను లాక్కెళ్లుతున్న ఫైనాన్సోళ్లు
- ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని విజ్ఞప్తి

“ ఆటోడ్రైవర్ల బతుకు ఆగమైంది. ఉపాధి లేక.. ఇల్లు గడవక కుటుంబాల్లో ఆకలి కేక వినిపిస్తున్నది. ప్రయాణికుల చేరవేతతో దశాబ్దాలుగా ఏ రంది లేకుండా జీవించిన కార్మికుల కుటుంబాలపై ఆరు నెలల కింద కాంగ్రెస్ సర్కారు తెచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తీవ్ర ప్రభావాన్ని చూపింది. వారి ఉపాధికి గండికొట్టింది. గత డిసెంబర్ ముందు వరకు ఆటో నిండా ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చుతూ రోజుకు రూ.వెయ్యి సంపాదించగా, ప్రస్తుతం తిండి ఖర్చుల మందం రాని దైన్యం కనిపిస్తున్నది. ఈఎంఐలు సైతం కట్టలేకపోతుండడంతో ఫెనాన్సోళ్లు ఆటోలు లాక్కెళ్లుతున్నయని, ఎలా బతకాలో అర్థం కావడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. తమ పిల్లల చదువును సైతం నిలిపివేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి త్వరగా చూపకపోతే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన చెందుతున్నారు.



కరీంనగర్ కేడీసీసీబీ ఎదుట ఆటో అడ్డా వద్ద తమను ఆదుకోవాలంటున్న డ్రైవర్లు

### గిరాకీ లేదు.. బతుకు లేదు

మాది మానకొండూర్ మండలం వెల్ది. కరీంనగర్‌కు 20 కిలో మీటర్లు ఉంటది. అక్కడి నుంచి ఒక్క ట్రిప్పు వెయ్యాల్నంటే నూటాయాభై రూపాయల డీజిల్ కాలుతది. కనీసం ఎనిమిది మంది ఉంటే ట్రిప్పుకో వంద, రెండు వందలు మిగిలేది. అపుడు నాలుగైదు ట్రిప్పులు కొట్టేది. ఇపుడు గిరాకే లేకుంట వాయే. రూపాయి మిగుల్తలేదు. ఇంట్ల ఆటో పెట్టుకుని ఉంటె ఎట్లని రోడ్డు మీదికి వస్తే మా పరిస్థితి గిది. నాకు ఇద్దరు పిల్లలు. భార్య ఇంట్లనే ఉంటది. ఆటో మీదనే బతుకాలే. పిల్లల చదువులెట్ల? ఇల్లు గడుసుడెట్ల? ఆడోళ్లకు ఫ్రీ బస్సు అయినకాంచే మా బతుకులు ఆగమైనయి.



**- ఆర్ సంతోష్‌కుమార్, వెల్ది**

కరీంనగర్, మే 23 (నమస్తే తెలంగాణ): ఎలాంటి జీవనోపాధి లేని ఎందరో యువకులు ఆటోను ఆధారం చేసుకుని జీవితాలు గడుపుతున్నారు. దశాబ్ధాల తరబడి ఇదే వృత్తిలో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. పిల్లలను చదివించుకుంటున్నారు. ఉన్నంతలో గొప్పగా బతికేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేక ఎందరో విద్యావంతులు సైతం ఇదే వృత్తిని ఎంచుకుని తమ కాళ్లపై తాము నిలబడ్డారు. ఆరు నెలల వరకు బాగానే ఉన్నా.. ఆ తర్వాత పరిస్థితి మారింది. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రోడ్డు టాక్స్‌లు రద్దు చేసి ఈ వృత్తిని ప్రోత్సహించింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి ఆటో డ్రైవర్ల వృత్తికి ఉరితాడు బిగించింది. ఆటో నడుపుకొంటేనే పొట్టగడిచే కుటుంబాలు ఇప్పుడు దిక్కులేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఒకప్పుడు అలా వచ్చి రోడ్డపై నిలబడగానే నిమిషాల్లో నిండే ఆటోలు ఇప్పుడు గంటల తరబడి నిలబడినా సరిపడే ప్రయాణికులు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఆటోల్లో ఎక్కువగా ప్రయాణించే మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయం ఉన్న ఆర్టీసీ బస్సుల కోసమే ఎదురు చూస్తుండగా, ఆటోవాలాలు బిక్కమొహాలతో ఎదురు చూడాల్సిన దుస్థితి వచ్చింది.

#### పిల్లల చదువుపై ప్రభావం

ఆరు నెలలుగా ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోతున్న ఆటోవాలాలు చివరకు పిల్లలను చదివించుకోలేని దుస్థితి వచ్చింది. శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన మొలుగూరి సంపత్ ఉదంతమే అందుకు ఓ ఉదాహరణ. తన ఇద్దరు కొడుకులను కేశవపట్నంలోని మోడల్ స్కూల్లో చదిస్తున్నాడు. ఇంటర్ వరకు ఇక్కడే చదువుకున్న సంపత్ కొడుకు ఒకరు ఇప్పుడు డిగ్రీ కోసం ఇటు కరీంనగర్‌కో, అటు హుజూరాబాద్‌కో వెళ్లాలి. కానీ, ఆటో నడవక పోవడంతో సంపత్ కుటుంబాన్ని పోషించడమే భారంగా మారింది. ఆరు నెలల కింద కరీంనగర్ నుంచి తాడికల్‌కు నాలుగైదు ట్రిప్పులు వేసే సంపత్‌కు ఇపుడు ఒక ట్రిప్పు ప్రయాణికులు దొరకడమే కష్టంగా మారింది. వచ్చిన డబ్బులు డీజిల్ ఖర్చులు పోనూ ₹వంద, ₹200 కూడా చేతిలో మిగలడం లేదు. ఈ పరిస్థితుల్లో తన కొడుకును డిగ్రీ ఎలా చదివియ్యగలని సంపత్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన కొడుకు చదువు ఆపేసి ఏదైనా పనిలో పెడతానని వాపోయాడు. ఇప్పుడు అనేక మంది ఆటో డ్రైవర్లు సంపత్‌లాగే నిస్సహాయ స్థితిలో కనిపిస్తున్నారు. ఆటోలు నడవకపోవడంతో చాలా మంది తమ కుటుంబాలను పోషించుకునేందుకు అప్పులు చేస్తున్నారు. కొందరికి అవి కూడా పుట్టడం లేదని, బతుకులు వెల్లదీయడం దినదిన గండంగా మారిందని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. పెండ్లిళ్లకు ఎదిగిన ఆడపిల్లలున్న ఆటోడ్రైవర్ల పరిస్థితి మరీ దారుణంగా మారిందని, పిల్లల పెండ్లిళ్లు చేసే పరిస్థితులు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆటో డ్రైవర్లు గుండె పోటుకు గురై మరణిస్తుండగా.. మరి కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.



గిరాకీ లేకపోవడంతో ఆటోలోనే నిద్రిస్తున్న డ్రైవర్

#### ట్రిప్పులు కరువే

కరీంనగర్‌లోని కేడీసీసీబీ ప్రధాన బ్రాంచ్ ఎదుట ఆటో నంబర్-2 అడ్డా ఒకప్పుడు నిత్యం వచ్చే పోయే ప్రయాణికులతో, ఆటోల సందడితో కిటకిటలాడేది. మానకొండూర్, తిమ్మాపూర్, చిగురుమామిడి, గన్నేరువరం, బెజ్జంకి, శంకరపట్నం తదితర మండలాలకు సంబంధించిన 60 నుంచి 70 గ్రామాల ప్రజలకు ఇక్కడ క్షణాల్లో ఆటోలు దొరికేవి. ఈ మండలాల్లో ఏ గ్రామానికి వెళ్లాలన్నా, ఎప్పుడొక ఆటో అందుబాటులో ఉండేది. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. బస్సులు నడవని సమయంలోనే మహిళా ప్రయాణికులు ఆటోల కోసం ఇక్కడికి వస్తున్నారు. కొద్దిపాటిగా అందుబాటులో ఉన్న ఆటోలు వారిని ఎక్కించుకుని గంటల కొద్ది నిరీక్షిస్తున్నాయి. ఆటో నిండితే తప్పా ముందుకు సాగని పరిస్థితి. మానకొండూర్ మండలం లింగాపూర్‌కు చెందిన పిట్టల కుమార్ మంగళవారం ఉదయం 9 గంటలకు తన ఊరి నుంచి నలుగురు ప్రయాణికులతో కరీంనగర్‌కు వచ్చాడు. మనిషికి ₹40 చొప్పున చార్జి తీసుకుని తిరిగి వెల్దికి వెళ్లేందుకు ఈ స్టాండ్ వద్ద ఆటో నిలిపాడు. మధ్యాహ్నం 2 గంటల వరకు 8 మంది ప్రయాణికులు దొరికారు. ఆ సమయంలో లింగాపూర్‌కు బస్సు లేక పోవడంతో కుమార్ అదృష్టం బాగుండి నాలుగురైదుగురు మహిళా ప్రయాణికులు కూడా దొరికారు. ఇదే కుమార్ ఆరు నెలల కింద లింగాపూర్ నుంచి కరీంనగర్‌కు రోజుకు ఐదారు ట్రిప్పులు వేసేవాడు. ఇప్పుడు ఒక్క ట్రిప్పు కూడా వేయలేని పరిస్థితి ఉందంటే ఆటో డ్రైవర్ల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

#### ప్రత్యామ్నాయంతోనే గాడిన

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతోనే తమకు ఇబ్బందులు మొదలయ్యాయని ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. ఆటోల్లో ఎక్కువగా ప్రయాణించేది మహిళలేనని, అందువల్లే తమకు గిరాకీ తగ్గిందని వాపోతున్నారు. తమకు ప్రత్యామ్నాయం చూపితేనే తమ బతుకులు తిరిగి గాడిన పడుతాయని చెబుతున్నారు. తమకు ఏడాదికి ₹12 వేలు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెప్పినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడుతున్నారు. అవి ఇచ్చినా తమకు ఏ మాత్రం సరిపోవని, రేవంత్ రెడ్డి ఇచ్చే డబ్బులు రోజుకు ₹33 మాత్రమే పడతాయని, అవి మాకెందుకని ప్రశ్నిస్తున్నారు. కొత్తగా ఆటోలు కొనుక్కున్న వాళ్లు ఈఎంఐలు చెల్లించలేక పోతున్నారని, ఫైనాన్స్ కంపెనీలు అనేక మంది ఆటోలను లాక్కెల్లాయని వారు చెబుతున్నారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని, లేదంటే తమ బతుకులు మరింత ఆగమైతాయని ఆటోడ్రైవర్లు ముక్త కంఠంతో స్పష్టం చేస్తున్నారు.

### ఎట్ల బతుకుడో భయమైతంది



మా పరిస్థితి చాన దారుణంగున్నది. నేను పదమూడేండ్ల సంది ఆటో నడుపుతున్న. ఇసొంటి పరిస్థితి ఎప్పుడు చూడలే. ఆటో నడుస్తెనే మాకు పూట గడుసుడు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. భార్య ఇంటి కాన్నే ఉంటది. ఇన్నాళ్లు ఆటో మంచిగ నడిచినప్పుడు ఏ కష్టం అనిపియ్యలే. ఒకప్పుడు రోజుకు వెయ్యికి తక్కువ సంపాదించకపోదుం. ఈ ఆరునెల్ల సంది గిరాకీ దొరుకుత లేదు. దొరికినా డీజిల్ ఖర్చులు పోనూ వంద రెండొందలు మిగులుతున్నయ్. ఇల్లు గడుసుడు కష్టమైతంది. ఇట్లయితే ఎట్ల బతుకుడో తలుచుకుంటెనే భయమైతంది. నా బిడ్డ ఇపుడు యూకేజీ చదువుతంది. కరీంనగర్ ప్రైవేట్ స్కూళ్ల ఏసిన. పోయిన ఏడాది 18 వేలు కట్టిన. ఇపుడు రూపాయి చేతిల లేదు. నా బిడ్డ చదువెట్లనో అర్థమైత లేదు.

**- దాడి అనిల్, లింగాపూర్ (మానకొండూర్ మండలం)**

### పోరగాండ్ల చదువు ఆపుడైతది

ఆటోలు నడిచినప్పుడు మంచిగనే బతికినం. నాకు ఇద్దరు కొడుకులు. ఇద్దరినీ కేశవపట్నం మోడల్ స్కూల్ల చదివిస్తన్న. ఒకనిది ఇంటర్ అయిపోయింది. ఇప్పుడు



డిగ్రీకి చదివియ్యాలే. ఇంకొకడు టెన్త్ పాసైండు. వాన్ని మోడల్ స్కూళ్లనే చదివిస్త. డిగ్రీ చదివెటోని పరిస్థితితే అర్థమైత లేదు. ఆటో నడిస్తే చదివిచ్చెటోన్నే. ఇప్పుడు ఆటో నడుస్తలేకపాయే. ఇల్లు గడుసుడే కష్టంగావట్టే. పోరగాండ్లను యాడికెళ్లి చదివియ్యాలే. అందుకే వాని చదువాపి ఏదైనా పనిలో పెడత. ఇంటికి ఇంత ఆసరైతడు. మరేం చేద్దాం. మా బతుకులు ఇట్ల తయారైనయ్.

**- మొలుగూరి సంపత్, తాడికల్ (శంకరపట్నం)**



ప్యాసింజర్లు లేక కేడీసీసీబీఎదుట అడ్డా-2పై నిలిపి ఉంచిన ఆటోలు



కొడిమ్యాల : పూడూర్ కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# రైతులకు అడిగే హక్కులేదా?

### బోనస్ అడిగితే అవమానిస్తారా..?

- వ్యవసాయ శాఖ మంత్రికి అవగాహన ఉన్నదా
- అప్పుడు బాండు పేపర్లు రాసిచ్చి ఇప్పుడు సన్నాయి నొక్కులా
- రైతుల గుండెల మీద తన్నుతున్నది రేవంత్ ప్రభుత్వం కాదా
- వాళ్లకు ఏ ఒక్క హామీని అమలు చేయ చేతనైత లేదు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ధ్వజం
- పూడూరులో కొనుగోలు కేంద్రం పరిశీలన

కొడిమ్యాల, మే 23 : కాంగ్రెస్ ఇచ్చిన హామీల గురించి రైతులకు అడిగే హక్కులేదా? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులు ₹500 బోనస్ గురించి అడిగితే.. మంత్రి స్థాయిలో ఉండి ''మొరుగుతున్నారు'' అనే పదాన్ని వాడి అవమాన పరిచాడని ధ్వజమెత్తారు. బోనస్ అడిగే రైతులను కుక్కలతో పోల్చే ప్రయత్నం చేస్తాడా..? అని మండిపడ్డారు. ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి ఏమాత్రం అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని ఆగ్రహించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రైతు భరోసా కింద ఎకరానికి ₹15 వేలు ఇస్తామని, ₹2 లక్షల రుణమాఫీ చేస్తామని, వ్యవసాయ కూలీలకు ₹12 వేలు, కౌలు రైతులకు ₹15 వేలు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇంకా వడ్లకు ₹500 బోనస్ ఇస్తామని బాండ్ పేపర్ రాసిచ్చి ఈరోజు కేవలం సన్నరకం వడ్లకే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. రైతులకు ఇచ్చిన ఏ హామీని అమలు చేయడం లేదని, ఆఖరికి ధాన్యం కొనేందుకు కూడా ఈ సర్కారుకు చేతనైతలేదని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చి రైతుల గుండెలమీద తన్నుతున్నది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. కొడిమ్యాల మండలం పూడూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని త్వరగా తూకం వేస్తలేరని వారు చెప్పడంతో జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. త్వరగా తూకం వేసేలా చూడాలని కోరారు. రమేశ్, లచ్చిరెడ్డికి చెందిన ధాన్యం తడిసిందని, దానిని తూకం వేయాలని సూచించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూశారని, 24 గంటల కరెంట్, పంటలకు సరిపడా సాగు నీరు అందించినట్లు గుర్తు చేశారు. ఎన్నికల ముందు బాండు పేపర్లలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్, భట్టి విక్రమార్క, కాంగ్రెస్ నాయకులు వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని రాసిచ్చారని గుర్తు చేశారు. రైతుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పెట్టి వడ్లకు బోనస్ ఇస్తామని ప్రకటించారని చెప్పారు. ఇప్పుడు సన్నవడ్ల పేరిట దొడ్డువడ్లకు బోనస్ ఇవ్వబోమని కొర్రీలు పెడుతున్నారని మండిపడ్డారు. జగిత్యాల జిల్లాలో యాసంగిలో 3,00,723 ఎకరాల్లో వరి వేశారని, అందులో 3,00,073 ఎకరాల్లో దొడ్డు వడ్లు, కేవలం 650 ఎకరాల్లో మాత్రమే సన్నవడ్లు పండించారని చెప్పారు. సన్నవడ్లను రైతులు తమ ఇంట్లో తినడానికి మాత్రమే పండిస్తారని, కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి అమ్ముకునేంత పండించారని తెలిపారు. గత యాసంగిలో కేసీఆర్ ప్రభుత్వం 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే.. ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు కొన్నది 37 లక్షల మెట్రిక్ టన్నులు దాటలేదన్నారు. రైతులు కల్లాల్లో ధాన్యం ఉంచుకొని ఓపిక లేక ప్రైవేట్‌కు అమ్ముకోవాల్సి వస్తున్నదన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామని భరోసానిచ్చారు. అంతకు ముందు కొండగట్టు అంజన్న సన్నిధిలో హరీశ్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇక్కడ ముడుపు కట్టిన ఆయన, ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలువడంతో వచ్చి ఆలయ ప్రాకార మండపంలో పూజలు చేసి, ముడుపును విప్పారు. ఆ తర్వాత ఆంజనేయస్వామివారిని దర్శించుకున్నారు. ఆయాచోట్ల హరీశ్‌రావు వెంట మల్యాల జడ్పీటీసీ కొండపల్కల రామ్మోహన్‌రావు, తిర్మలాపూర్ సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్, అయిల్నేని సాగర్‌రావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశం, నాయకులు ఎగుర్ల తిరుపతి, బొడ్డు రమేశ్, సురబి సాగర్‌రావు, గడ్డం లక్ష్మారెడ్డి, చింతపంటి ఆదయ్య, రేకులపల్లి తిరుపతిరెడ్డి, ఓల్లాల లింగాగౌడ్, అక్బర్, గడ్డమీది గంగయ్య, బొలుమాల్ల గంగాధర్, వేణురావు, కొత్తూరి స్వామి, చాంద్‌పాషా పాల్గొన్నారు.

#### బోనస్‌పై అసెంబ్లీని అడ్డుకుంటాం

మంత్రులు హైదరాబాద్‌లో ఏసీల్లో కూర్చోవడం కాదు. గ్రామాల్లో తిరిగాలి. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు చేయిస్తూ భరోసా ఇవ్వాలి. ధాన్యం త్వరగా తూకం వేసేలా చూడాలి. రైతులకు ₹500 బోనస్ ఇచ్చేవరకు వదలం. త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటం. రైతుల కోసం ఉద్యమిస్తం.

**- హరీశ్‌రావు**



కొండగట్టులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

#### సన్నాల పేరిట మోసం

రాష్ట్రంలోని 90 శాతం మంది రైతులు దొడ్డు వడ్లు పండిస్తరు. ఒక ఎకరంలో దొడ్డు రకం 27 క్వింటాళ్ల వరకు పండితే.. సన్న రకం 15 క్వింటాళ్ల వరకే పండుతుంది. దాదాపు 7 నుంచి 8 క్వింటాళ్లు పంట దిగుబడి తక్కువగా వస్తుంది. సన్నాలకు రోగాలు ఎక్కువ. పెట్టుబడి ఎక్కువ. నెల రోజుల కాలపరిమితి ఎక్కువ. అయినా సన్నవడ్లు బయట విక్రయిస్తే క్వింటాల్‌కు ₹2800 నుంచి ₹3వేల వరకు వస్తయి. అంటే ప్రభుత్వం ఇచ్చే బోనస్‌కు అదనం. ఇది రైతులు చెబుతున్న మాట. సన్నాల పేరిట రేవంత్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల ముందు బోనస్ గురించి చెప్పలేదు. ఓట్లు వేసిన డబ్బాలు సీల్ కాగానే బోనస్‌ను తెరపైకి తెచ్చింది. రైతులను నిలువునా ముంచుతున్నది.

**- హరీశ్‌రావు**



వీసీ సురేంద్ర మోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యూనివర్సిటీ అధికారులు

## ఎస్‌యూ వీసీ బాధ్యతల స్వీకరణ

కమాన్‌చౌరస్తా, మే 23 : శాతవాహన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా కే సురేంద్రమోహన్ ఐఏఎస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్, ఫైనాన్స్ ఆఫీసర్ రవీందర్, తదితరులు సురేంద్ర మోహన్‌ను హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రస్తుతం రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ విభాగానికి కార్యదర్శిగా ఉన్న ఆయన అక్కడే బాధ్యతలు స్వీకరించి, విశ్వవిద్యాలయ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. ప్రధానంగా విద్యార్థుల చదువు తర్వాత ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ముందుకు సాగాలని, ప్రస్తుత, పూర్వ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలని ఆకాంక్షించినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

## ‘హరిత హననం’కు స్పందన

### తిమ్మాపూర్ ఎంపీడీవోను నివేదిక కోరిన కలెక్టర్

నమస్తే ఎఫెక్ట్



కార్యదర్శుల నుంచి వివరణ తీసుకుంటున్న ఎంపీడీవో విజయ్‌కుమార్

తిమ్మాపూర్, మే 23: పర్యావరణాన్ని పరిరక్షించే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ‘హరిత హారం’ ఇప్పుడు హరితహననంగా మారిపోయింది. మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకుని అప్పటి సర్కారు పచ్చదనం పెంపునకు కృషి చేయగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలకు ఇప్పుడు రక్షణ లేకుండా పోయింది. ఎక్కడికక్కడ ఎండిపోతుండడం, నరికి వేస్తుండడంపై ఈ నెల 21న ‘హరితహననం‘ శీర్షికన ‘నమస్తే తెలంగాణ’ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి కలెక్టర్ పమేలా సత్పతి స్పందించి, నివేదిక ఇవ్వాలని తిమ్మాపూర్ ఎంపీడీవో విజయ్ కుమార్‌ను ఆదేశించారు. దీంతో ఆయన గురువారం రంగంలోకి దిగారు. మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శుల నుంచి ఎక్కడెక్కడ హరితహారం చెట్లను నరికారు? అందుకు గల కారణాలతో నివేదిక తీసుకున్నారు. ప్రధానంగా విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను నరికినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గ్రామాల్లో హరితహారం మొక్కలను, చెట్లను సంరక్షించాలని కార్యదర్శులకు అధికారులు సూచించారు.


